క్లుప్తంగా

కార్తీకమాస పూజలకు ఏర్పాట్లు



నందిగామ: హిందువులు ఎంతో పవిత్రమాసంగా భావించే కార్తీకమాసం మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో నందిగామ డివిజన్ పరిధిలోని శైవక్షేత్రాలు కార్తీకశోభను సంతరించుకున్నాయి. ప్రతి గ్రామంలోని శివాలయాన్ని రంగురంగు విద్యుద్దీపాలతో అలంకరించారు. పట్టణంలోని పురాతన రామలింగేశ్వరస్వామి వారి ఆలయం కార్తీక పూజలకు ముస్తాబైంది. ప్రముఖ పుణ్యక్షేత్రమైన కూడలి సంగమేశ్వరస్వామి వారి ఆలయాన్ని కార్తీక మాసం సందర్భంగా నెలరోజులపాటు నిర్వహించే పూజలకు ఏర్పాట్లు చేశారు. ఆయా గ్రామాల్లోని శివాలయాలను కూడా కార్తీకమాస పూజలకు భక్తులు ముస్తాబు చేశారు.

ఘనంగా గ్యార్మీ వేడుకలు



జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ 23వవార్డు ముస్లిం మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో స్థానిక జెండా జెట్టు వద్ద గ్యార్మీ పండుగ వేడుకలను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను హాజరయ్యారు. జెండాల వద్ద కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జరిగిన విందు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఉదయభాను ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి షేక్ జుబేర్, వార్డు కౌన్సిలర్లు దువ్వల రమాదేవి రామకృష్ణ, నూకల సాంబ, వార్డు మైనార్టీ నాయకులు షేక్ ఫయాజ్, గౌస్, షబ్బీర్, జాను, అజ్మద్, ఏఎంసీ డైరెక్టర్ షేక్ మస్తాన్, వార్డు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పోచంపల్లిని అభివృద్ధి చేశాం

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో జగ్గయ్యపేట మండలంలోని పోచంపల్లిని రూ.30కోట్లతో అభివృద్ధి చేసినట్లు గ్రామసర్పంచి లక్ష్మీనాగిరెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, పోచంపల్లి టీడీపీ నాయకుడు ముల్లంగి రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తాము చేసిన అభివృద్ధిలో పావుశాతం అభివృద్ధిని కూడా టీడీపీ హయాంలో చేయలేదన్నారు. వార్డులో తగిన ఓట్లు కూడా పొందలేని రామకృష్ణారెడ్డికి ఎమ్మెల్యే ఉదయభానును విమర్శించే స్థాయి లేదని ఎద్దేవా చేశారు.

శుక్లాల ఆపరేషన్ల కోసం రోగుల తరలింపు



జగ్గయ్యపేట: మండలంలో ఇటీవల నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో శుక్లాల ఆపరేషన్లు అవసరమని గుర్తించిన 50మందిని సోమవారం గుంటూరు జిల్లా పెదకాకానిలోని శంకర్ నేత్రాలయకు తరలించారు. ఇందుకోసం ప్రత్యేకంగా బస్సును ఏర్పాటు చేయగా, బూచవరం వైద్యాధికారి ఎస్.అనిల్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని షేర్ మహమ్మద్ పేటకు చెందిన పదిమంది, గండ్రాయి గ్రామస్తులు ముగ్గురు, చిల్లకల్లు నుంచి పదిమంది, అనుమంచిపల్లి నుంచి ఐదుగురు, బలుసుపాడు నుంచి 14మంది, అన్నవరంలో ముగ్గురు, గౌరవరం నుంచి ఆరుగురికి కలిపి మొత్తం 50మంది శుక్లాల ఆపరేషన్లు అవసరమని జగనన్న ఆరోగ్య శిబిరాల్లో గుర్తించామన్నారు. వీరందరికీ ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకట్రావు, అలివేలమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో లింగగూడెం

- రూ.1.20కోట్లతో అభివృద్ధి పనులు..
- 65మందికి ఇళ్లస్థలాలు
- వినియోగంలోకి పురాతన బావి
- రూ.45లక్షలతో సచివాలయం



లింగగూడెంలో నిర్మించిన సచివాలయ భవనం

లింగగూడెం(పెనుగంచిప్రోలు): మండలంలోని లింగగూడెం ప్రస్తుతం అభివృద్ధిపథంలో దూసుకుపోతోంది. దశాబ్దాలుగా గ్రామంలో నెలకొన్న సమస్యలను సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో పరిష్కరించింది. అదేవిధంగా సుమారు కోటిన్నర రూపాయలు వెచ్చించి మౌలిక వసతులు కల్పించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాసేవలో సచివాలయం..

గతంలో ఎన్నడూ లేనివిధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత లింగగూడెంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే రూ.45లక్షలతో నిర్మించి సచివాలయ భవనం ప్రజలకు విశేష సేవలను అందిస్తోంది. గడపగడపకు కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన రూ.20 లక్షలతో ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని డ్రైనేజీ సమస్యను పరిష్కరించారు. డ్రైనేజీ పనుల కోసం మరో రూ.7లక్షలను కూడా ప్రభుత్వం కేటాయించడంతో గ్రామంలో డ్రైనేజీ సమస్య పూర్తిగా పరిష్కరమైంది.

పురాతన బావికి మరమ్మతులు..

గ్రామంలో 60ఏళ్ల చరిత్ర కలిగి పాడుబడి ఉన్న బావికి పంచాయతీ సర్పంచి బరిగెల మంగమ్మ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. ఈ బావి అందుబాటులోకి రావడంతో మంచినీటి వసతికి ఇబ్బంది లేకుండా ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో ఇళ్లులేని నిరుపేదలు 65మందికి జగనన్న కాలనీలో స్థలాలు కేటాయించి ఇళ్లు మంజూరు చేశారు. జగనన్న కాలనీల్లో కూడా లక్షలాది రూపాయలతో మౌలికవసతులు కల్పించేందుకు చేపట్టిన పనులు కొనసాగుతున్నాయి.

రూ.52లక్షలతో పాఠశాలల అభివృద్ధి..

లింగగూడెం యూపీ, ప్రాథమిక పాఠశాలల్లో నాడు–నేడు కార్యక్రమం కింద అభివృద్ధి పనులు



నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు



వినియోగంలోకి తెచ్చిన పురాతన బావి

చేపట్టారు. రూ.52లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణంతోపాటు విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. పాఠశాలల అభివృద్ధిపనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇలా గ్రామంలో గతంలో మునుపెన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను సహకారంతో యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయంటూ లింగగూడెం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామం బాగుపడింది



ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, అధికారుల సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాం. పాఠశాలలు ఎంతో బాగుపడ్డాయి. చిన్నగ్రామమైనా గతంలో ఎన్నడూలేని విధంగా మౌలికవసతుల కల్పనకు రాష్ట్రప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులను కేటాయించడంతో గ్రామాభివృద్ధికి దోహదపడింది.

– బరిగెల మంగమ్మ, సర్పంచ్

ఘనంగా దీపావళి వేడుకలు



నందిగామలో దీపావళి వేడుకల్లో చిన్నారులు



కుటుంబసభ్యులతో కలసి దీపావళి వేడుకల్లో ఎమ్మెల్యే సామినేని ఉదయభాను



దీపావళి సంబరాల్లో పేటవాసులు

నందిగామ: దీపావళి పండుగను డివిజన్ వ్యాప్తంగా ప్రజలు ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఇంటి ఆవరణను దీపాలతో అందంగా అలంకరించారు. లక్ష్మీదేవికి విశేషపూజలు చేశారు. పిల్లలు, పెద్దలనే తేడా లేకుండా అందరూ బాణాసంచా కాల్చి సందడి చేశారు. ఆదివారం సాయంత్రం నుంచే పట్టణంలో పండుగ సందడి మొదలైంది. బాణాసంచా వెలుగులతో అమావాస్య చీకట్లు పోయి పౌర్ణమి వెలుగులు కనిపించాయి. నందిగామ పట్టణంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో దీపావళిని ప్రజలు వేడుకగా జరుపుకున్నారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట అర్బన్: దీపావళి పండుగ వేడుకలను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.ఇళ్లన్నీ ప్రమిద దీపాల కాంతుల వెలుగులతో నిండాయి. మహిళలు ప్రమిదలతో ఇళ్లు, ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. అన్ని దేవాలయాల్లో దీపాలంకరణలు, దీపోత్సవాలను నిర్వహించారు. ప్రభుత్వ అధికారులు సూచించిన మార్గదర్శకాల మేరకు అన్ని జాగ్రత్తలు పాటిస్తూ తక్కువ ధ్వని కాలుష్యం గల టపాసులు, మతాబులను ప్రజలు కాల్చారు.

ఉదయభాను నివాసంలో..

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను నివాసంలో దీపావళి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయభాను, ఆయన సతీమణి విమలాభాను, కుమార్తె ప్రియాంక, కుటుంబ సభ్యులు కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొని మతాబులు, కాకరపువ్వొత్తులు కాల్చారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి : చీకట్లు పారదోలి వెలుగులు విరజిమ్మే దీపావళి పండుగను ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. కుటుంబసభ్యులు, బంధువులతో ఇళ్లన్నీ కళకళలాడాయి. రాత్రి పూట ప్రతి ఇంటివద్ద ప్రమిదలను వెలిగించారు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా బాణసంచా కాల్చుతూ సందడి చేశారు. ఆలయాలు దీపాల వెలుగులతో కళకళలాడాయి. ఆలయ నిర్వాహకులు ప్రత్యేక అలంకరణల నడుమ పూజా కార్యక్రమాలను నిర్వహించారు

పెనుగంచిప్రోలులో..

పెనుగంచిప్రోలు: దీపావళి వేడుకలను పెనుగంచిప్రోలు మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వాడవాడలా బాణాసంచా కాల్చడంతోపాటు ఇళ్లల్లో లక్ష్మీదేవికి విశేష పూజలు నిర్వహించారు. గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో దీపావళి సందర్భంగా ఓం, శంఖుచక్ర నామాలు, త్రిశూలం ఆకారంలో భారీగా దీపాలు అలంకరించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, పురోహితులు ఆలయ సిబ్బంది, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో..

కంచకచర్ల : మండల ప్రజలు దీపావళి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు ఇళ్లను దీపాలతో ప్రత్యేకంగా అలంకరించి, లక్ష్మీపూజ చేశారు. ఉదయాన్నే ఆలయాలను దర్శించి పూజలు చేశారు. స్నేహితులు, బంధువులతో కలిసి బాణసంచా కాల్చి దీపావళి పండుగను ఘనంగా జరుపుకున్నారు.



దీపాల వెలుగుల్లో వత్సవాయి కన్యకాపరమేశ్వరీ అమ్మవారు



శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో దీపాలంకరణ

జాతీయోద్యమానికి స్ఫూర్తి..కొణకంచి



కొణకంచిలోని శ్రీరామచంద్ర బాలభక్త గ్రంథాలయం



1930 నాటి సుజ్ఞానప్రద పత్రిక ప్రతులు

కొణకంచి(పెనుగంచిప్రోలు): జాతీయోద్యమంలో భాగంగా పెనుగంచిప్రోలు మండలం కొణకంచిలోని గ్రంథాలయం నాడు ప్రజల్లో చైతన్యం కలిగించింది. మూడేళ్ల కిందట అంగరంగ వైభవంగా శతజయంతి ఉత్సవాలను జరుపుకున్న కొణకంచి గ్రంథాలయ విశిష్టతను మంగళవారం నుంచి ప్రారంభంకానున్న గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రామస్తులు గుర్తుచేసుకుంటున్నారు. 1916 జూలై18న కొణకంచిలో గ్రామానికి చెందిన కొణకంచి చక్రధరరావు, పురుషోత్తమరావు, కాకుమాను పిచ్చయ్య, నకరికంటి వెంకయ్య, చిత్రావూరి వీరభద్రయ్య తదితరులు గ్రంథాలయాన్ని స్థాపించారు. గ్రంథాలయ అధ్యక్షులుగా కాకుమాను పిచ్చయ్య, కార్యదర్శిగా అయ్యదేవర లక్ష్మీనరసింహం పనిచేశారు. 1926లో గ్రంథాలయానికి శ్రీరామచంద్ర బాలభక్త గ్రంథాలయంగా పేరును స్థిరపరిచారు. అధ్యక్షులుగా రేపాల బుచ్చిరామయ్య శ్రేష్ఠి, కార్యదర్శిగా శ్రీరామ గోవిందశర్మ వ్యవహరించారు. గ్రంథాలయానికి సువిశాలభవనంతోపాటు ఆనాడే కళావేదికను కూడా ఏర్పాటు చేశారు. 1930 ఏప్రిల్ 9న గ్రంథాలయ 14వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు తొలిశాసనసభ స్పీకర్ అయ్యదేవర కాళేశ్వరరావు, దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు వంటి ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభల్లో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు, భోగరాజు పట్టాభి సీతారామయ్య, జయంతిపురం రాజు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకటరమణయ్య, ఎన్‌జీ రంగా, మాగంటి బాపినీడు, కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ వంటి ప్రముఖులు చేసిన ప్రసంగాలు ప్రజల్లో జాతీయోద్యమ స్ఫూర్తిని రగిలించాయని స్థానికులు చెబుతున్నారు. 1930లో బుచ్చిరామయ్య శ్రేష్ఠి గ్రంథాలయం నుంచి సుజ్ఞానప్రద వంటి పత్రికలు నడిపారు. ఈ పత్రికలు నాడు ప్రజల్లో ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని కలిగించి జాతీయోద్యమంలో పాల్గొనేలా చేశాయి. వేలాది గ్రంథాలు, పుస్తకాలతో కొలువుదీరిన ఈ గ్రంథాలయం తమకు దేవాలయంతో సమానమని గ్రామస్తులు చెబుతున్నారు.

నేడు భీమవరంలో వై ఏపీ నీడ్స్ జగన్

భీమవరం(వత్సవాయి): మండలంలోని భీమవరం–2 సచివాలయ పరిధిలో మంగళవారం సాయంత్రం మూడుగంటలకు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సచివాలయ ఆవరణలో జరిగే ఈ కార్యక్రమానికి జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

నేడు వేదాద్రిలో ..

జగ్గయ్యపేట: మండలంలోని వేదాద్రి గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం మధ్యాహ్నం మూడుగంటలకు నిర్వహిస్తున్నట్లు మండల సచివాలయాల కన్వీనర్ సయ్యద్ షాబుద్దీన్ సోమవారం తెలిపారు. సచివాలయం వద్ద లబ్ధిదారుల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరణ, ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు జరిగిన మేలును వివరించనున్నట్లు చెప్పారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలంతా పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు మధుమేహ నియంత్రణపై అవగాహన సదస్సు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని వీజీఆర్ డయాబెటీస్ ఎడ్యుకేషనల్ అండ్ అవేర్‌నెస్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మధుమేహ నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మధుమేహ నిపుణులు డాక్టర్ కె.వేణుగోపాలరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహించే ఈ సదస్సులో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.జయసూర్య, సినీనటుడు పద్మభూషణ్ అవార్డు గ్రహీత కన్నెగంటి బ్రహ్మానందం పాల్గొంటారని చెప్పారు. మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని రెండు తెలుగు రాష్ట్రాల్లోని 500 పాఠశాలల్లో విద్యార్థులకు డయాబెటీస్‌పై అవగాహన కలిగించేందుకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఆయా పోటీల్లో 55 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకూ వీజీఆర్ డయాబెటీస్ అట్లాస్‌ను తెలుగు, ఇంగ్లీషు బాషల్లో ఆవిష్కరించామని, మంగళవారం హిందీలో ముద్రించిన పుస్తకాన్ని అతిథుల చేతుల మీదగా ఆవిష్కరిస్తామని వివరించారు.

ఫ్యాక్టరీ మూసివేయాలంటూ ఆందోళన

షేర్ మహమ్మద్‌పేట (జగ్గయ్యపేట): కాలుష్యాన్ని వెదజల్లుతున్న గ్రీన్‌టెక్ ఎన్విరో సొల్యూషన్ కర్మాగారాన్ని మూసివేయాలంటూ షేర్‌మహమ్మద్‌పేట గ్రామస్తులు సోమవారం ఆందోళన నిర్వహించారు. కర్మాగానికి వెళ్తున్న లారీలను వారు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కొంతకాలంగా కర్మాగారం నుంచి వస్తున్న కాలుష్యం కారణంగా అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయంపై ఇప్పటికే ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. కర్మాగారాన్ని మూసివేస్తామని యాజమాన్యం గతంలో హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు కర్మాగారాన్ని మూసివేయలేదని ఆందోళన వ్యక్తంచేశారు. గ్రామస్తుల ఆందోళన విషయం తెలుసుకున్న చిల్లకల్లు ఎస్ఐ కృష్ణబాబు అక్కడికి చేరుకుని వారితో చర్చించారు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్తామని ఆందోళన విరమించాలని చెప్పడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోట కృష్ణరామనాథం, షేక్ గౌస్, దంతాల నరేంద్ర, తిరుపతయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ కృష్ణబాబు

వెంటాడుతున్న టీడీపీ పాపాలు

- నాడు భారీగా ఇసుక తవ్వకాలు
- 2002లో మున్నేటిలో ఇదేగుంతలో పడి 15మంది విద్యార్థులు బలి
- నేడు అదే గుంతలో ముగ్గురు మృతి

కంచికచర్ల : కీసర మున్నేటిలో ఈతకు వెళ్లి ముగ్గురు యువకులు మృతి చెందిన నేపథ్యంలో గతంలో టీడీపీ నాయకులు ఇక్కడ జరిపిన ఇసుక తవ్వకాలే కారణమనే అంశం కంచికచర్ల మండలంలో మరోసారి చర్చనీయాంశమైంది. కీసర మున్నేటి పాత కాజ్‌వేకు వంతెనకు మధ్య సుమారు దశాబ్దంన్నరకు పైగా ఇక్కడ ఇసుక తవ్వకాలు జరగడం లేదు. మున్నేరులో 1995 నుంచి 2004 వరకు మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఇసుక తవ్వకాలు జరిగాయనేది ఈ ప్రాంత ప్రజలందరికీ తెలిసిన విషయమే. ఈక్రమంలో 2002లో కీసరలో ఓ తోటలో కార్తీకమాస వనభోజనానికి వచ్చిన విజయవాడ రవీంద్రభారతి పాఠశాలకు చెందిన 15మంది విద్యార్థులు ఈత కొట్టేందుకు మున్నేటిలోని ఇదే గుంతలోకి దిగి మృతిచెందిన విషయాన్ని స్థానికులు గుర్తుచేసుకుంటున్నారు. అప్పట్లో జరిపిన ఇసుక తవ్వకాల కారణంగా కాజ్ వే దిగువన భారీ గొయ్యి ఏర్పడి ఇప్పటికీ ఆ గుంత అలానే ఉంది. సోమవారం రోజు ముగ్గురు యువకులు కూడా ఇదే గుంతలో పడి మృతిచెందడంపై ఈపాపం నాటి టీడీపీ హయాంలో జరిపిన ఇసుక తవ్వకాలదేనని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఇకనైనా ఆత్మ విమర్శ చేసుకోవాలి..

18ఏళ్లుగా మున్నేటి పాత కాజ్‌వేకు వంతెనకు మధ్య ఎటువంటి ఇసుక తవ్వకాలు జరగనప్పటికీ మున్నేటిలో ప్రస్తుత ఇసుక తవ్వకాల కారణంగానే యువకులు మృతి చెందారని మాజీఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆరోపిస్తుండటంపై స్థానికులు మండిపడుతున్నారు. మాజీఎమ్మెల్యేకు సరైన పరిజ్ఞానం, అవగాహన లేకపోవడమే కారణమని చర్చించుకుంటున్నారు. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే మాజీఎమ్మెల్యే సౌమ్య ఇటువంటి చౌకబారు ఆరోపణలు చేస్తున్నారని చర్చ సాగుతోంది. అభూత కల్పనలతో ఆరోపణలు చేయడం, రాజకీయం లబ్ధి పొందాలనుకోవడం సరికాదంటున్నారు. ప్రభుత్వంలో ఉన్న ప్రజాప్రతినిధులు, నాయకులపై విమర్శలు చేసే ముందు మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఓసారి ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని నాటి సంఘటనను గుర్తుచేసుకుంటున్న స్థానికులు అంటున్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

జగ్గయ్యపేట అర్బన్ : స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం ఉదయం తొమ్మిదిన్నర గంటలకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమవుతాయని గ్రంథాలయాధికారి ఆలేటి ప్రభ సోమవారం తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు నిర్వహించే వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 14వ తేదీన శతక పద్యాల పోటీ, 15న గన్నీ బ్యాగ్ పోటీ, 16న చిత్రలేఖనం, 17న వ్యాస రచన, వక్తృత్వం, 19న ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రోజూ సాయంత్రం 5.30 గంటలకు సాహిత్య కార్యక్రమాలు ఉంటాయని, అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు వీరులపాడు మండల పరిషత్ సమావేశం

వీరులపాడు(కంచికచర్ల): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 14వ తేదీ ఉదయం 10గంటల నుంచి జుజ్జూరులోని జల్లి ఏసోబు కల్యాణ మండపంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో అరుంధతీదేవి సోమవారం తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ పాల్గొంటారన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరుకావాలని కోరారు. ఆయా మండలశాఖ అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి తప్పక హాజరుకావాలని ఎంపీడీవో సూచించారు.

అమ్మవారి అలంకారానికి గాజులు అందజేత

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గ అమ్మవారికి ఈ నెల 15న గాజుల అలంకారం చేయనున్నారు. ఈ క్రమంలో అమ్మవారి గాజుల అలంకారం నిమిత్తం ఆర్యవైశ్య సేవా సంఘం (గొల్లపూడి) తరుపున సోమవారం సుమారు రూ.50 వేలు విలువ చేసే 182 తోడాలు (35వేల గాజులు)ను దేవస్థానం అధికారులకు అందచేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు మద్దాలి శ్రీనివాస కుమార్, జనరల్ సెక్రటరీ చన్నా పద్మావతి, చన్నా సాంబశివరావు, పలువురు సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మద్దాలి శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ కార్తీక శుద్ధ విదియను పురస్కరించుకుని 15వ తేదీ బుధవారం దుర్గమ్మను గాజులతో అలంకరించనున్న నేపథ్యంలో తమ సంఘం పక్షాన ఈ గాజులను విరాళంగా అందించామని తెలిపారు. మట్టి గాజులు మహిళల సౌభాగ్యానికి గుర్తుగా వేసుకుంటారని, రంగు రంగుల గాజుల అలంకారంలో సౌభాగ్యవతిగా వెలిగిపోయే దుర్గమ్మను దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని చెప్పారు.

నేటి నుంచి ఎంఎస్ మూర్తి శత జయంతి ఉత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): లలిత కళల అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన ఎంఎస్ మూర్తి శత జయంతి ఉత్సవాలు మంగళవారం ది ఆంధ్ర అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యాన ముత్యాలంపాడు ఎంఎస్ మూర్తి లలిత కళ ఆర్ట్ గ్యాలరీలో ఘనంగా నిర్వహించనున్నట్లు అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఆనంద్‌స్వరూప్, ఎంవీ సాయిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లలిత కళల అభివృద్ధికి గానూ తాము ఎంఎస్ మూర్తి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 5 గంటలకు రామాయణ సుధానిధి, భాషా ప్రవీణ డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు చేతుల మీదుగా ఎంవీ సాయిబాబు రచించిన అక్షర రేఖాచిత్ర శిల్పి పుస్తకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. అందరూ హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.